

నెత్తురోడిన రహదారులు

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం చెందారు. అతివేగంతోనే ఈ ప్రమాదాలు జరిగాయి. 8లో



టమాట కిలో రూ.28

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.28 పలికింది. కనిష్టం రూ.12, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

34.9°/ 17.3°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. వేకువజామున మంచు కురుస్తోంది. చలి వాతావరణం నెలకొంది. ఈశాన్యం దిశగా గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జేబులో పేలిన టపాసులు



గాయపడిన తాహీర్

గుత్తి: దీపావళి సందర్భంగా స్థానిక జెండా వీధిలో ఆదివారం రాత్రి టపాసులు కాలుస్తున్న 9వ తరగతి విద్యార్థి తాహీర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్యాంట్ జేబులో టపాసులు ఉంచుకుని కాలుస్తుండగా నిప్పు రవ్వ ఎగిరి పడడంతో జేబులోని టపాసులు ఒక్కసారిగా పేలాయి. కుటుంబ సభ్యులు గమనించి ప్యాంట్‌ను చించేశారు. అప్పటికే తొడకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

'విద్యా దీవెన'కు జాయింట్ అకౌంట్ చేయించుకోవాలి



అనంతపురం రూరల్: జగనన్న విద్యా దీవెన పథకం కింద నాల్గో విడత లబ్ధి కోసం తల్లితో పాటు విద్యార్థులు తప్పనిసరిగా జాయింట్ బ్యాంకు అకౌంట్ చేయించుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూధన్ రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 న జగనన్న విద్యాదీవెన నాల్గో విడత నగదు జమ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుందన్నారు. తల్లితో పాటు విద్యార్థులు కలసి ఉమ్మడి బ్యాంక్ అకౌంట్ తెరవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు, 2022–23 సంవత్సరంలో ఫైనలియర్ చదువుతన్న విద్యార్థులకు జాయింట్ అకౌంట్ అవసరం లేదని తెలిపారు. తల్లితో పాటు విద్యార్థులను పథకంలో భాగస్వామ్యం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. మూడు రోజుల్లో జాయింట్ అకౌంట్ చేయించుకుని సచివాలయాల్లో బ్యాంక్ ఖాతా వివరాలను సమర్పించాలని సూచించారు.

నేటి నుంచి యాక్షన్ ప్లాన్‌పై శిక్షణ

- శ్రీకాళహస్తి కేంద్రంగా ఎంపీడీఓలకు



అనంతపురం సిటీ: ఉపాధి హామీ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరానికి చేపట్టనున్న వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై ఎంపీడీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి కేంద్రంగా ఒక్కో బ్యాచ్‌కు మూడురోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా నుంచి తొలి విడత శిక్షణకు 19 మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలు హాజరు కానున్నారు. వీరికి మంగళ, బుధ, గురువారం శిక్షణ ఉంటుంది.తొలి విడత శిక్షణకు అనంతపురం రూరల్, నార్పల, బుక్కరాయసముద్రం, బ్రహ్మసముద్రం, గార్లదిన్నె, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం, కణేకల్లు, పెద్దవడగూరు, పామిడి, పుట్లూరు, శెట్టూరు, శింగనమల, వజ్రకరూరు, బెళుగుప్ప, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, గుత్తి, గుంతకల్లు మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలు హాజరు కానున్నారు.

జిల్లా సీనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

అనంతపురం: వచ్చే నెలలో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే జిల్లా సీనియర్ జట్ల ఎంపిక ప్రక్రియ ఆదివారం జరిగింది. అనంతపురంలోని కొత్తూరు జూనియర్ కళాశాల క్రీడామైదానంలో చేపట్టిన ఈ ప్రక్రియను విశ్రాంత ఏఎస్పీ రజాక్ (టెన్నికాయిట్ సంఘం అధ్యక్షుడు), ఉపాధ్యక్షుడు చెన్నయ్య, అసోసియేషన్ కార్యదర్శి ఆర్.రంగస్వామి పర్యవేక్షించారు. పురుషుల జట్టుకు మహిధర్, లతీఫ్, గురుస్వామి, పునీత్‌కుమార్ ఎంపిక కాగా, మహిళల జట్టులో అమృత, సింధు, సుప్రియ, జ్యోతిక చోటు దక్కించుకున్నారు. కార్యక్రమంలో పీడీ అమరాంజనేయులు, సీనియర్ క్రీడాకారులు కె.రంగస్వామి, బి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంటి ఆవరణలో చిచ్చుబుడ్డీని వెలిగిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



దీపాలు వెలిగించి వేడుకలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కుటుంబం



అనంతపురంలో బాణాసంచా వెలుగులు

అంబరం.. దీపావళి సంబరం



వెలుగుల పండుగ దీపావళి సంబరం జిల్లా అంతటా అంబరమంటింది. చీకట్లు పారదోలి వెలుగులకు స్వాగతం పలుకుతూ ప్రతి ఇంటా దీపాలు వెలిగించారు. ప్రత్యేక పూజలతో లక్ష్మీదేవిని ఆహ్వానించారు. సాయంత్రం నుంచి చిన్న, పెద్ద అందరూ కలసి బాణాసంచా పేల్చుతూ ఆనందంగా గడిపారు. నింగి కెగిసిన తారా జువ్వలు, రంగురంగుల మిరిమిట్లు గొలుపుతూ పేలుతున్న షాట్లు, భూమిపై తిరిగే చక్రాలు, చిచ్చుబుడ్డీలు, కాకరపూలు, టపాసుల మోతలతో అంతటా సందడి కనిపించింది.

– అనంతపురం కల్చరల్

రాప్తాడు ఏఎస్‌వీ జట్టు విజయం



సాత్విక్



మన్విత

అనంతపురం: అనంతపురం ప్రీమియర్ లీగ్ పోటీల్లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌ల్లో రాప్తాడు బాల, బాలికల జట్లు విజయం సాధించాయి. అండర్–16 బాలికల విభాగంలో రాప్తాడు– గుత్తి రైల్వే ఇనిస్టిట్యూట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత గుత్తి జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 14.1 ఓవర్ల వద్ద 43 పరుగులకు జట్టు ఆలౌట్ అయింది. రాప్తాడు బౌలర్ ఎ.మన్విత 5 ఓవర్లలో 8 పరుగులు ఇచ్చి 5 వికెట్లు కూలదోసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రాప్తాడు జట్టు కేవలం 3.3 ఓవర్లలోనే 44 పరుగులతో ఘన విజయం సాధించింది. జట్టులో బి.నేహ 14 బంతుల్లో 9 ఫోర్లతో 37 పరుగులు సాధించింది. అండర్–16 బాలుర విభాగంలో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన రాప్తాడు (ఏఎస్‌వీ) జట్టు 40 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. జట్టులో ఆర్.సాత్విక్ 131 బంతుల్లో 28 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 187 పరుగులు సాధించాడు. అలాగే మరో బ్యాటర్ ఫణికుమార్ 84 బంతుల్లో ఏడు ఫోర్లతో 78 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన తపోవనం క్రికెట్ అకాడమి (టీసీఏ) జట్టు 36.2 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో తన్మయి కార్తీక్‌రెడ్డి 79 బంతుల్లో 14 ఫోర్లు, 2 సిక్సర్లతో 84 పరుగులు సాధించాడు.

జేఎన్‌టీయూ వీసీ నియామకానికి సెర్చ్ కమిటీ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన పదవీ కాలం 2024 జనవరి 13న ముగియనుంది. నూతన వీసీ నియామకం కోసం సెర్చ్ కమిటీని రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలారావు నియమించారు. కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఈ ముగ్గురు వైస్ చాన్సలర్ (వీసీ) పదవి కోసం ముగ్గురు పేర్లు ప్రతిపాదిస్తారు. ఇందులో ఒకరిని వీసీగా చాన్సలర్/ గవర్నర్ నియమిస్తారు. సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం నామినీగా ప్రొఫెసర్ బీలా సత్యనారాయణ (పూర్వ వీసీ, ఆంధ్రా యూనివర్సిటీ), వర్సిటీ పాలకమండలి నామినీగా ప్రొఫెసర్ కె.బాలవీరారెడ్డి (పూర్వ వీసీ, వీటీయూ, కర్ణాటక), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నామినీగా ప్రొఫెసర్ కృష్ణపాల్ సింగ్ (మహాత్మా జ్యోతిరావు పూలే వర్సిటీ, రోహిల్‌ఖండ్, బారెల్లి, ఉత్తరప్రదేశ్)లను ఉన్నారు. త్వరలోనే సెర్చ్ కమిటీ సమావేశమై.. దరఖాస్తులన్నింటినీ పరిశీలించి మూడు పేర్లను ప్రతిపాదించనుంది.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి 20వ తేదీ వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి సోమవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ప్రతి మండల శాఖాలోనూ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, సాహితీసాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఇదేం దందా.. అయ్యా!



❒ ఇది రాజశేఖర్ అనే వ్యక్తికి గనులు, భూగర్భ శాఖ అధికారులు మంజూరు చేసిన తాత్కాలిక పర్మిట్. ఈయనకు ప్రభుత్వ వర్క్‌లు మంజూరు కాకపోయినా గనులు, భూగర్భ శాఖ ఉన్నతాధికారి మాత్రం ఆత్మకూరు మండల కేంద్రంలోని సర్వే నంబర్ 290లో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో గ్రావెల్ తవ్వుకునేందుకు జీఎస్టీ నంబర్ లేకుండానే ఈ తాత్కాలిక లీజు పర్మిట్ (ఐడీ 1211230717) మంజూరు చేశారు. దీంతో ఆయన గ్రావెల్ తవ్వించి టిప్పర్ రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు ప్రైవేట్ వ్యక్తులు, వెంచర్లకు అమ్మి సొమ్ము చేసుకున్నాడు.



❒ టి.ప్రవీణ్‌కుమార్ పేరిట గనులు, భూగర్భ శాఖ ఉన్నతాధికారి పామిడి మండలం వంకరాజుకాలువ గ్రామంలో సర్వే నంబర్ నమోదు చేయకుండానే 2.5ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక గ్రావెల్ లీజును మంజూరు చేశారు. దీంతోపాటు పెద్దపప్పూరు మండలం జూటూరులో సర్వే నంబర్ 1281లో మరో 2.50 ఎకరాల విస్తీర్ణంలో గ్రావెల్ తవ్వకానికి లీజు మంజూరు చేశారు. ఈయన బడా కాంట్రాక్టరూ కాదు.. ప్రభుత్వ వర్కులు అసలు చేయనూ లేదు. అయినా సరే ఉన్నతాధికారి అండదండలు పుష్కలంగా ఉండటంతో అలా దందా సాగుతోంది.



నరసనాయనికుంట వద్ద కొండను అక్రమంగా తవ్వేసిన దృశ్యం

- గనులు, భూగర్భ శాఖలో మహా ఘనుడు
- బినామీల పేరిట ఇష్టారాజ్యంగా పర్మిట్లు
- లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి అక్రమ తవ్వకాలు
- నూతన పాలసీని సైతం ఆదాయ వనరుగా మార్చిన అధికారి

అనంతపురం టౌన్: గనులు, భూగర్భ శాఖలో కీలక బాధ్యతల్లో ఉన్న ఆ 'అయ్య' నూతన పాలసీని తనకు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. జిల్లాలో రియల్ ఎస్టేట్ వెంచర్లు, భవన నిర్మాణదారుల నుంచి మట్టికి మంచి డిమాండ్ ఉంది. దీంతో ఆయన తన బినామీల పేరిట అనధికారికంగా లీజు పర్మిట్లు ఇచ్చి అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు జిల్లా వ్యాప్తంగా మట్టి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో 'తాత్కాలికం' పేరిట లీజుకు పర్మిట్లు ఇచ్చారు.

తాత్కాలిక పర్మిట్లలో నిబంధనలకు తూట్లు

ప్రభుత్వ రోడ్ల నిర్మాణాలు, ఇతరత్రా పనులకు వ్యక్తులు లేదా సంస్థలకు ఎంత పరిమాణం మేర మట్టి అవసరం ఉంటుందో ఆ స్థాయిలో జిల్లా ఉన్నతాధికారుల ఆమోదంతో తాత్కాలిక పర్మిట్లను గనులు, భూగర్భశాఖ అధికారులు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే ఇలాంటి నిబంధనలు ఆ 'అయ్య' పాటించలేదు. అనంతపురం రూరల్, కూడేరు, ఆత్మకూరు, పామిడి, పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె తదితర మండలాల్లో గ్రావెల్ తవ్వకాల కోసం కావలసిన వ్యక్తులకు తాత్కాలిక పర్మిట్లు ఇచ్చారు.

10 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా తవ్వకాలు

అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంట సమీపంలోని కొండగుట్టలో అనధికారికంగా మట్టి తవ్వుకునేందుకు గనులు, భూగర్భ శాఖ అధికారులు కొంత మంది వ్యక్తులకు అనుమతి ఇవ్వడంతో భారీ స్థాయిలో తవ్వేసుకున్నారు. అనంతపురంలో ఓ త్రీస్టార్ హోటల్ నిర్వాహకుడు గొటుకూరు వద్ద గల తన వెంచర్‌లో స్థలం చదును, రోడ్డు విస్తరణకు అవసరమైన మట్టి కోసం గనులు, భూగర్భ అధికారిని ప్రసన్నం చేసుకుని ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వుకున్నాడు. ఒక్క నరసనాయనికుంటలోనే 10 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా అక్రమ తవ్వకాలు జరిగాయంటే ఏ స్థాయిలో మట్టి అక్రమ రవాణా జరుగుతోందో స్పష్టంగా తెలుస్తుంది. ఒక క్యూబిక్ మీటర్‌కు రూ.140 ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రభుత్వ ఆదాయానికి 10 లక్షల క్యూబిక్ మీటర్లపై రూ.14 కోట్లు గండి పడిందన్నమాట. ఇక జిల్లా వ్యాప్తంగా ఏ స్థాయిలో మట్టి అక్రమ రవాణా జరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

విజి'లెన్సు'కు కనిపించని అక్రమాలు

గనులు, భూగర్భ శాఖ విజిలెన్సుతో పాటు రీజనల్ విజిలెన్సు విభాగాలు జిల్లా అంతటా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అయితే వీటికి మట్టి అక్రమ రవాణా కనపడినట్లు లేదు. భారీ స్థాయిలో మట్టి రవాణా చేస్తున్నా కేసులు నమోదు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. అక్రమార్కులు తాత్కాలిక పర్మిట్ల నకిలీ సీళ్లను తయారు చేసి వాటితో మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

తాత్కాలిక అనుమతులు లేవు



జిల్లాలో మట్టి తవ్వకాలకు తాత్కాలిక అనుమతులు ఎక్కడా ఇవ్వకూడదు. అనధికారికంగా తవ్విన వారిపై, అనుమతులు ఇచ్చిన అధికారులపై కఠినంగా చర్యలుంటాయి. ప్రభుత్వాదాయానికి గండికొట్టే ఎలాంటి చర్యలనూ ఉపేక్షించబోం. దీనిపై అవసరమైతే ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను నియమించి చర్యలు తీసుకుంటాం.

–కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

పోలీస్ కస్టడీలో శ్రీధరన్ ముఠా

- బంగారం, హవాలా డబ్బు దోపిడీయే లక్ష్యంగా కార్యకలాపాలు
- అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి ఆధ్వర్యంలో విచారణ



అఖిల్



అప్పూ



సాజిస్



సిహాబుద్దీన్



ప్రవీణ్‌దాస్



సుజిత్

అనంతపురం క్రైం: హవాలా సొమ్ము, బంగారు ఆభరణాలను చాకచక్యంగా దోపిడీ చేయడంలో శ్రీధరన్ ముఠాది అందెవేసిన చేయి. దక్షిణాది రాష్ట్రాల్లో భారీ దోపిడీలతో పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తమిళనాడులోని కృష్ణగిరి పోలీసు స్టేషన్ పరిధిలో కొద్ది రోజుల క్రితం ఆరు కిలోల బంగారు నగలు అపహరించిన కేసులో అరెస్టయిన ఈ ముఠాలోని సభ్యులను అనంతపురం జిల్లా పోలీసులు పీటీ వారెంట్‌పై రెండు రోజుల క్రితం కస్టడీకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా మరో ఇద్దరిని కస్టడీకి తీసుకునేందుకు పోలీసులు తమిళనాడు వెళ్లారు.

రాప్తాడు దోపిడీ కేసుపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

గత ఏడాది నవంబరులో రాప్తాడు శివారులోని 44వ జాతీయ రహదారిపై కారుతో సహా రూ.2 కోట్ల నగదు దోపిడీకి గురైన ఘటన తెలిసిందే. నిందితుల కోసం పోలీసులు సాగించిన అన్వేషణ అప్పట్లో అర్థంతరంగా ఆగిపోయింది. నూతన ఎస్పీ అన్బురాజన్ ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కేసును ఛేదించేందుకు అన్ని విధాలా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శ్రీధరన్ ముఠా కదలికలపై నిఘా సారించారు. కాగా అప్పటికే ఈ ముఠా తమిళనాడులోని కృష్ణగిరి పోలీసులకు ఓ భారీ చోరీ కేసులో పట్టుబడినట్లు తెలుసుకున్న ఎస్పీ.. నిందితులను కస్టడీకి తీసుకుని విచారణ సాగించాలని రాప్తాడు పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. రంగంలోకి దిగిన అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వై.శివారెడ్డి బృందం శ్రీధరన్ ముఠాలోని ఆరుగురు సభ్యులను కస్టడీకి కోరింది. రెండు రోజుల క్రితం ముఠా సభ్యులైన సుజిత్, ప్రవీణ్‌దాస్, సిహాబుద్దీన్ అలియాస్ సిబూ, సాజిస్ అలియాస్ కుట్టన్, అప్పూ అలియాస్ అందానీ, అఖిల్ అలియాస్ అంబులెన్స్‌లను కస్టడీలోకి తీసుకున్నారు.

వెలుగులోకి దందాలు..

శ్రీధరన్ ముఠా చీకటి దందాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇప్పటి దాకా పదుల సంఖ్యలో హవాలా డబ్బు దోచుకున్న ఘటనల్లో శ్రీధరన్‌ను కీలక సభ్యుడిగా పోలీసులు గుర్తించారు. అసలు శ్రీధరన్‌ని నేరుగా చూసిన వారు ఈ ముఠాలో ఎవ్వరూ లేకపోవడం గమనార్హం. శ్రీధరన్ ముఖం కూడా చూడకుండా ఇంత పెద్ద నెట్‌వర్క్ కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పని చేస్తుండటం చూసి పోలీసులు అవాక్కవుతున్నారు. ప్రధానంగా హవాలా డబ్బుతో పాటు భారీగా బంగారు కొనుగోలు వ్యాపారులపై నిఘా పెట్టే ఈ ముఠా పక్కా ప్లాన్‌తో ఇప్పటి దాకా దాడులు చేసింది. చీకటి వ్యాపారాల్లో దిగ్గజాలుగా ఉన్న వారినే టార్గెట్‌గా చేసుకుని ఈ దాడులు చేస్తున్న శ్రీధరన్ జాడ పోలీసులు నేటికీ తెలుసుకోలేకపోయారు.

పక్కా ప్లానింగ్..

తనతో నిత్యం టచ్‌లో ఉండే సిరీల్, సిహాబ్‌లను కూడా శ్రీధరన్ ఏడాదికి ఒకసారి కూడా కలిసిన సందర్భాలు లేవట. శ్రీధరన్ సిమ్ కార్డులు, లేదా మనుషులను ఇంటికి పంపి కబురు పెడితే వీరు వెళ్లి కలుస్తారట. ప్లాన్‌తో పాటు డబ్బు, బంగారం ఏ నంబరు వాహనాల్లో వస్తాయో అన్నీ తానే చెబుతాడు. కేవలం మనుషులతో శ్రీధరన్ చెప్పిన ప్రకారం వెళ్లి దాడి చేసి దోచుకోవడం.. అనంతరం సగ భాగం వాటా తీసేసుకుని వెనకున్న సభ్యులకు పంచి పెట్టడం వీరి పనిగా తెలిసింది. కాగా కృష్ణగిరి పోలీసులకు అనుకోకుండా పట్టుబడిన ఈ ముఠా ఎట్టకేలకు ఇప్పటి దాకా సాగించిన నేరాల చిట్టాను బయట పెట్టినట్లు తెలిసింది. అందులో భాగంగానే రాప్తాడు వద్ద జాతీయ రహదారిపై జరిగిన దారి దోపిడీ కేసు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

దోపిడీ కేసులో రికవరీలేదు

రాప్తాడు వద్ద జరిగిన రూ.2 కోట్ల దోపిడీ కేసులో ఒక్క రూపాయి కూడా రికవరీ కాలేదు. పైగా మరో దోపిడీకి యత్నిస్తున్న తరుణంలో 'అనంత' పోలీసులు వెంటాడి అప్పట్లో ఈ ముఠాలోని కొంత మందిని అరెస్ట్ చేశారు. కీలకమైన వారు పరారీలో ఉన్నట్లు చూపించారు. ఇదిలా ఉండగా తమిళ పోలీసులు ఈ ముఠాను అరెస్ట్ చేయడంతో రాప్తాడు సమీపంలో జరిగిన దోపిడీ కేసు తిరిగి తెరపైకి వచ్చింది. కాగా ఈ ముఠా దోపిడీ అనంతరం డబ్బును ఎక్కడ దాచిందన్న సమాచారాన్ని రాబట్టలేకపోయారు. ముఠా సభ్యులు రాబరీకి వినియోగించే కార్లు, వాటి నంబరు ప్లేట్లు టోల్‌గేట్‌కు ఒకటి చొప్పున మార్చడం లాంటి అన్ని విషయాలను కూపీలాగిన పోలీసులు డబ్బు రికవరీతో పాటు కీలక నిందితుడైన కొడాలి శ్రీధరన్‌ను పట్టుకోలేకపోయారు. ప్రస్తుతం కస్టడీలో ఉన్న నిందితుల ద్వారా సమాచారం రాబట్టి శ్రీధరన్‌ను అరెస్ట్ చేస్తారా లేదా వేచి చూడాలి.

సురక్షితంగా.. పాతాళగంగ

- సేఫ్‌జోన్‌లో 30 మండలాలు, డేంజర్‌లో ఒక మండలం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో పాతాళగంగ సురక్షితంగానే ఉంది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవలేదు. గత జూన్ 1 నుంచి అక్టోబర్ ఆఖరుకు 420.6 మి.మీ వర్షం పడాల్సి ఉండగా 40 శాతం తక్కువగా 253.8 మి.మీ వర్షం కురిసింది. దీంతో నాలుగేళ్లుగా 5 నుంచి 8 మీటర్ల మధ్య కనిపించిన భూగర్భ జలాలు ఈసారి సగటు పది మీటర్లకు చేరాయి. భూగర్భజలాలు కొంత తగ్గినప్పటికీ జిల్లాలో 30 మండలాలు సేఫ్ జోన్‌లోనే ఉన్నాయి. యల్లనూరు మండలం మాత్రమే డేంజర్‌లో ఉంది. యల్లనూరులో పరిమితికి మించి నీటిని వాడుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం 3 మీటర్లలోపు ఒక మండలంలో కనిపిస్తుండగా... 3 నుంచి 8 మీటర్ల మధ్య 12 మండలాలు, 8 నుంచి 15 మీటర్ల మధ్య 14 మండలాలు, 15 మీటర్లు అంతకన్నా ఎక్కువగా లోతులో 4 మండలాల్లో భూగర్భజలాలు ఉన్నాయి. సాంకేతికపరంగా ప్రస్తుతం జిల్లాలో 39 టీఎంసీలు అందుబాటులో ఉండగా.. అందులో 15 టీఎంసీలు వినియోగిస్తున్నారు. ఇంకా 24 టీఎంసీల లభ్యత ఉంది.

వేసవిలో కూడా సమస్య ఉండదు

భూగర్భజలాల లభ్యత తగ్గినా వచ్చే వేసవిలో తాగునీటికి సమస్య ఎక్కడా ఉండకపోవచ్చని భూగర్భజలశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.తిప్పేస్వామి చెబుతున్నారు. అయితే పొదుపుగా నీటివాడకం చేపట్టాలని సూచిస్తున్నారు. వరి లాంటి నీటి వాడకం ఉన్న పంటలు వేయకపవడం, పంటలకు పారుడు పద్ధతి కాకుండా డ్రిప్ విధానం అవలంబిస్తే సమస్య ఎదురుకాకపోవచ్చని తెలిపారు. ఈ ఏడాది వర్షం రూపంలో 92 టీఎంసీలు ప్రవహించగా అందులో 11 టీఎంసీలు భూగర్భంలో ఇంకిపోయినట్లు తెలిపారు. ప్రస్తుతానికి 12 గ్రామాల్లో వాల్టా చట్టం అమలు చేస్తున్నట్లు చెప్పారు.



గార్లదిన్నెలో బోరుబావి నుంచి సమృద్ధిగా వస్తున్న నీళ్లు

మండలాల వారీగా తాజా సగటు నీటి మట్టం

మండలం	నీటిమట్టం (మీటర్లలో)
అనంతపురం	6.06
ఆత్మకూరు	6.40
బీకే సముద్రం	6.25
బెళుగుప్ప	12.45
బొమ్మనహాళ్	8.36
బ్రహ్మసముద్రం	10.15
డి.హీరేహాళ్	16.89
గార్లదిన్నె	4.51
గుత్తి	11.38
గుమ్మఘట్ట	10.30
గుంతకల్లు	5.77
కళ్యాణదుర్గం	12.61
కంబదూరు	10.55
కణేకల్లు	15.33
కూడేరు	8.98
కుందుర్పి	8.43
నార్పల	6.49
పామిడి	11.55
పెద్దపప్పూరు	0.86
పెద్దవడుగూరు	5.17
పుట్లూరు	11.18
రాప్తాడు	4.52
రాయదుర్గం	14.51
శెట్టూరు	19.13
శింగనమల	5.29
తాడిపత్రి	11.00
ఉరవకొండ	4.60
వజ్రకరూరు	9.87
విడపనకల్లు	5.62
యాడికి	20.56

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా టోర్నీ విజేత 'అనంత'



అండర్‌–19 బాలికల విజేతగా నిలిచిన జట్టు

ఉరవకొండ: ఏపీ స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో జిల్లా జట్లు విజయకేతనం ఎగురవేశాయి. అండర్‌ –17, 19 విభాగాల్లో జరిగిన బాలికల ఫైనల్‌ పోటీల్లో పశ్చిమగోదావరి జట్లపై అనంతపురం జట్లు విజయం సాధించాయి. అండర్‌–14 బాలికల విభాగంలో 3వ స్థానం దక్కింది. ఈ క్రమంలో అండర్‌ –17, 19 విభాగాల్లో ప్రతిభ చాటిన వజ్రకరూరు మండలం తట్రకల్లు కేజీబీవీ విద్యార్థులు మానస, రమ్య, సురేఖ, తేజు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ఉభయ జిల్లాల ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శులు సుగుణమ్మ, అంజన్న, కో–ఆర్డినేటర్‌ నాగరాజు, పీడీలు మారుతి, వన్నూరుస్వామి, సెపక్‌తక్రా అసోసియేషన్‌ జిల్లా ఛైర్మన్‌ సప్తగిరి మల్లికార్జున, ఛైర్మన్‌ షాహీన్‌ అభినందించారు.

15న హ్యాండ్‌బాల్‌ బాలికల జట్టు ఎంపిక

కళ్యాణదుర్గం రూరల్‌: ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్‌ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలికల జట్టు ఎంపికను ఈ నెల 15న అనంతపురంలోని ఆర్ట్స్‌ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ కార్యదర్శి శివశంకర్‌ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2004, జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వెంట ఆధార్‌ కార్డు జిరాక్స్‌ తీసుకుని ఎంపికలకు హాజరు కావాలి. పూర్తి వివరాలకు 89781 37522, 97058 85939లో సంప్రదించవచ్చు.

నేటి నుంచి సహకార వారోత్సవాలు

అనంతపురం అగ్రికల్చర్‌: ఏటా నవంబర్‌ 14 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించనున్న అఖిల భారత సహకార వారోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది 70వ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్‌ బి.శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు మంగళవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 'భారత దేశాన్ని 5 ట్రిలియన్‌ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర' అనే అంశం ఆధారంగా చర్చాగోష్టి నిర్వహించనున్నారు. వారం రోజుల పాటు సహకార రంగం ఆవిర్భావం, విశిష్టత, సహకార సూత్రాలు, సహకార పతాకం, అందిస్తున్న సేవలు, సహకార వ్యవస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలను చైతన్య పరుచే కార్యక్రమాలు ఉంటాయి.

ఆకస్మిక అలజడి

- అనుబంధ ఇంజినీరింగ్‌ కళాశాలల్లో తనిఖీలు
- కోర్సు ప్రారంభమయ్యాక జేఎన్‌టీయూఏలో తొలిసారి
- అన్ని అంశాలపైనా క్షుణ్ణంగా పరిశీలన



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్‌ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలతో యాజమాన్యాల్లో అలజడి ప్రారంభమయ్యింది. 2023–24 విద్యా సంవత్సరం అనుబంధ గుర్తింపు దక్కించుకుని కోర్సులు ప్రారంభమైన తర్వాత వర్సిటీ యాజమాన్యం ఆకస్మిక తనిఖీలు చేస్తుండడంతో ఆందోళన మొదలైంది. విద్యార్థి, అధ్యాపక నిష్పత్తి, కళాశాలల్లో సదుపాయాలు, ల్యాబ్‌లో ప్రాక్టికల్స్‌లో కేటాయించిన మార్కులు తదితర అంశాలపై పరిశీలిస్తున్నారు. వర్సిటీ నిబంధనలకనుగుణంగా అధ్యాపకులకు వేతనాలు చెల్లిస్తున్నారా? లేదా అని ఆరాతీస్తున్నారు. ఆకస్మిక తనిఖీలతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కళాశాలల గుట్టు రట్టయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో జేఎన్‌టీయూఏ యాజమాన్య నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో 90 ఇంజినీరింగ్‌ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రధానంగా కంప్యూటర్‌ సైన్స్‌, దానికి అనుబంధంగా వచ్చిన కొత్త కోర్సు అంశంలోనే అధికారులు దృష్టి సారించారు. సైబర్‌ సెక్యూరిటీ, డేటా సైన్స్‌, ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌, రోబోటిక్స్‌ వంటి కోర్సుల్లో అవసరమైన ప్రోగ్రామ్స్‌ ఉన్నాయా? మౌలిక సదుపాయాలు ఏ మేరకు ఉన్నాయి? అనే అంశాలను తనిఖీ బృందాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. బయోమెట్రిక్‌ హాజరు విధానాన్ని వర్సిటీ తప్పనిసరి చేసినా, పలు కాలేజీలు దీన్ని అనుసరించలేదు. ఈ అంశాన్ని కూడా పరిశీలనలో భాగం చేయాలని నిర్ణయించారు. కాలేజీల్లో బోధించే సిబ్బంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే కాకుండా, వారి వ్యక్తిగత పాన్‌ కార్డుల ఆధారంగా ఆదాయ పన్ను శాఖ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు.

పక్కా సమాచారంతో తనిఖీలు..

బీటెక్‌ తరగతులు ఇప్పటికే ప్రారంభమయి నెలన్నర అవుతోంది. అనుబంధ గుర్తింపు దక్కించుకుని కోర్సులు ప్రారంభమయిన అనంతరం వర్సిటీ యాజమాన్యం పక్కా సమాచారంతో ఆకస్మిక తనిఖీలు చేయడం ఆందోళనలకు కారణం. వాస్తవానికి ప్రతి ఏటా అనుబంధ హోదా గుర్తింపు జారీ చేస్తారు. అనుబంధ గుర్తింపుకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే వర్సిటీ నిజనిర్ధారణ కమిటీని నియామకం చేసి కళాశాలలోని సౌకర్యాలను పరిశీలిస్తారు. నిజనిర్ధారణ కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ఆయా కళాశాలలోని ఇంజినీరింగ్‌ సీట్లు ఎన్ని కేటాయించాలి? గుర్తింపు ఇవ్వాలా? వద్దా? అనే అంశంపై స్పష్టతకు వస్తారు. ఈ క్రమంలో 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభంకు ముందే జేఎన్‌టీయూ అనంతపురం నిజనిర్ధారణ కమిటీ నియామకం చేసింది. కళాశాలలను పరిశీలించి నివేదిక అందజేశారు. సీట్లు కేటాయింపు పూర్తయ్యింది.

అధ్యాపకులకు అత్తెసరు జీతాలు :

వర్సిటీకి చెందిన రెండు బృందాలను ఆకస్మిక తనిఖీల నిమిత్తం నియమించారు. అనుబంధ గుర్తింపు హోదా దరఖాస్తు సమయంలో పొందుపరిచిన అంశాలు, నిజ నిర్ధారణ కమిటీలు ఇచ్చిన నివేదిక మేరకు సౌకర్యాలు ఉన్నాయా? లేదా? అని పరిశీలిస్తున్నారు. విద్యార్థి నిష్పత్తికి అనుగుణంగా అధ్యాపకులను నియామకం చేశారా? అధ్యాపకులకు వర్సిటీ నిబంధనల మేరకు జీతాలు, పీఎఫ్‌, చెల్లిస్తున్నారా? అనే అంశాలు పరిశీలిస్తున్నారు. అయితే సింహభాగం కళాశాలల్లో వర్సిటీ నిబంధలకు విరుద్ధంగా అత్తెసరు జీతాలు చెల్లిస్తున్నట్లు తనిఖీల్లో వెలుగులోకొచ్చింది. ఉన్నత విద్యార్హతలు ఉన్నా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, చేతికి అందిస్తూ మ్యానువల్‌గా సంతకాలు చేయించుకుంటున్నారు. ఎంటెక్‌ పూర్తి చేసిన వారినే అధ్యాపకులుగా నియామకం చేయాల్సి ఉంది. కేవలం బీటెక్‌ అర్హతతోనే అధ్యాపకులుగా నియామకం చేసుకున్నట్లు బయటపడింది.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

వర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్‌ కళాశాలల్లో అకడమిక్‌గా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యత ప్రమాణాలు పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ క్రమంలోనే ఇంజినీరింగ్‌ కళాశాల్లోని మౌలిక సదుపాయాలు, బోధన ప్రమాణాలను పరిశీలిస్తున్నాం. తొలిసారిగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాం. మభ్యపెట్టి అనుబంధ గుర్తింపు తెచ్చుకొని ఉంటే ఉపేక్షించబోం.

– ప్రొఫెసర్‌ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

కాంతులీనే 'కార్తీకం'



అనంతపురంలోని విరూపాక్షేశ్వరుడు

అనంతపురం కల్చరల్‌: శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన పవిత్ర కార్తీక మాసం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధ శైవక్షేత్రాలు కార్తీక పూజోత్సవాలకు సుందరంగా ముస్తాబయ్యాయి. ఈ మాసంలో వచ్చే నాలుగు సోమవారాలు, కార్తీక పౌర్ణమి, క్షీరాబ్ధి ద్వాదశి, కేదారేశ్వరీ నోములతో ప్రతి ఇంటా కాంతులీనుతుంటాయి. నిత్య శివారాధన, మారేడు దళాలు, తమ్మిపూల పూజలు, దీపకాంతులతో ఉభయ జిల్లాల వ్యాప్తంగా ఉన్న శైవాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకుంటాయి. కార్తీక మాసం ఈ నెల 14తో ప్రారంభమై వచ్చే నెల 12వ తేదీ వరకూ ఉంటుంది. రెండో సోమవారం నాడే కార్తీక పౌర్ణమి రానుండడం విశేషం. క్షీరాబ్ధి ద్వాదశి, జ్వాలాతోరణం, నాగపంచమి పర్వదినాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ మాసం ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడమే కాక సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తుందని అనంతపురంలోని పాతూరులో ఉన్న అత్యంత పురాతన విరూపాక్షేశ్వరాలయం అర్చకులు నిఖిల్‌ నారాయణ శ్రౌతులు తెలిపారు. ఈ మాసంలో తక్కువ ఆహారాన్ని తీసుకుంటూ ఉపవాసాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారన్నారు. కనీసం కార్తీక సోమవారాలతో పాటూ పౌర్ణమి నాడు చేసే ఉపవాస దీక్షలకు ఎంతో పుణ్యఫలం దక్కుతుందని కార్తీక పురాణంలో స్పష్టంగా పేర్కొనట్లుగా వివరించారు.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి ఆత్మహత్య

వేర్వేరు ప్రాంతాల్లో జీవితంపై విరక్తితో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అనారోగ్య పరిస్థితిని తాళలేక ఇద్దరు, కడుపు నొప్పి తాళలేక ఓ విద్యార్థి, భార్య కాపురానికి రాలేదని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు.



గురుకుమార్‌



చిన్న అక్కులప్ప



లాలుస్వామి (ఫైల్‌)

పెద్దపప్పూరు: మండలంలోని తురకపల్లికి చెందిన శ్రీరాములమ్మ (59) ఆత్మహత్య చేసుకుంది. కొన్ని నెలలుగా గుండె, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆమెకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమారుడు రామసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శరత్‌ చంద్ర తెలిపారు.

కంబదూరు: స్థానిక వడ్డే కాలనీకి చెందిన లక్ష్మీదేవి, వెంకటరమణ దంపతుల కుమారుడు వడ్డే గురుకుమార్‌(23) డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల కిడ్నీలో రాళ్లు ఉండడంతో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలోనే నొప్పి తీవ్రత భరించలేక సోమవారం ఇంట్లో లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బత్తలపల్లి: పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్‌ మండలం తాటిచెర్లకు చెందిన సునీతకు శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలోని పాతూరుకు చెందిన నరసింహులు కుమారుడు చిన్న అక్కులప్ప (27)తో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి బానిసైన చిక్క అక్కులప్ప రోజూ మత్తులో ఇంటికి చేరుకుని భార్యను చితక్కొట్టేవాడు. అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో విసుగు చెందిన ఆమె పిల్లలను పిలుచుకుని పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రావాలని పదేపదే ప్రాధేయపడినా ఆమె రాకపోవడంతో ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వేసిన తలుపులు వేసినట్టుగానే ఉండడంతో చుట్టుపక్కల వారు గమనించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతున్న అక్కులప్పను గుర్తించి, ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామానికి చెందిన బోయ లాలుస్వామి (21) ఆత్మహత్య చేసుకున్నాడు. వరికోత యంత్రం ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఆయన కొన్ని నెలలుగా మూర్ఛ, కడుపునొప్పితో బాధపడేవాడు. చికిత్స పొందినా జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో సోమవారం ఉదయం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బకాయిలు ఎగ్గొట్టు.. అడ్డదారుల్లో టెండరు పట్టు!

- పేరుకుపోయిన రూ.62.11 కోట్ల బకాయి
- నేటికీ చెల్లించని క్వారీ నిర్వాహకులు
- బంధువుల పేరుతో అనుమతులు దక్కించుకునే యత్నం



నేమకల్లు సమీపంలోని కంకర క్వారీ (ఫైల్‌)

రాయదుర్గం: గత ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డదారుల్లో క్వారీ టెండర్లు దక్కించుకున్న కొందరు.. రూ.62.11 కోట్ల బకాయిలను చెల్లించకుండా మరోసారి టెండర్లు దక్కించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బొమ్మనహాళ్‌ మండలం నేమకల్లు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్‌ 253లో 19 క్వారీలు, 12 స్టోన్‌ క్రషర్ల నిర్వహణకు మైన్స్‌ అండ్‌ జియాలజీ అధికారులు అనుమతులిచ్చారు. ఇందులో మెజార్టీ క్వారీలు టీడీపీ నాయకులే దక్కించుకున్నారు. 2014–19 మధ్య కాలంలో ఓ మంత్రి అండతో ఈ క్వారీలన్నీ టీడీపీ నాయకుడు కాంతారావునే నిర్వహించినట్లుగా ఆరోపణలున్నాయి.

రూ.కోట్లల్లో రాయల్టీ ఎగవేత

గతేడాది మే నెలాఖరు వరకూ ప్రభుత్వానికి రూ.7,32,87,603 రాయల్టీని క్వారీ నిర్వాహకులు చెల్లించాల్సి ఉంది. అప్పటికే పరిమితికి మించి తవ్వకాలు చేపట్టడంతో ఐదు రెట్లు పెంచి రూ.53,78,38,125 అపరాధ రుసుంతో మొత్తం రూ.61,11,25,728 చెల్లించాలని క్వారీ నిర్వాహకులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా బకాయిలు చెల్లించకుండా నిర్వాహకులు నిర్లక్ష్యంగా ఉంటూ వచ్చారు. ఈ మొత్తానికి వడ్డీలు లెక్కిస్తే దాదాపు రూ.100 కోట్లకు చేరి ఉంటుందని అంచనా.

మళ్లీ టెండర్లు దక్కించుకునే కుట్ర

క్వారీలకు టెండర్‌ అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మైనింగ్‌ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఇప్పటికే దాదాపు రూ.100 కోట్ల బకాయిల గంపనెత్తిన ఎత్తుకున్న నిర్వాహకులు.... ఇప్పట్లో ఆ భారం దించుకోవడం సాధ్యం కాదని తెలుసుకుని టెండర్లు దక్కించుకునేందుకు అడ్డదార్లు తొక్కుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇంత కాలం తాము నిర్వహిస్తున్న క్వారీల టెండర్లు చేజారకుండా బంధువుల పేరుతో వాటిని దక్కించుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. దీంతో రికార్డులన్నీ సర్దుబాటు చేశారనే ఆరోపణలూ వ్యక్తమవుతున్నాయి.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

నేమకల్లు క్వారీల నిర్వహణపై టెండర్ల ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో ముందస్తుగా గ్రామంలో మంగళవారం కాలుష్య నియంత్రణపై అధికారులు సమావేశం నిర్వహించి, ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నారు. ఇదే విషయాన్ని తహసీల్దార్‌ శ్రీనివాసులు నిర్ధారించారు. కాగా, టీడీపీ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా క్వారీల్లో తవ్వకాలు చేపట్టడంతో కాలుష్యం వెదజల్లి మూగజీవాలపై తీవ్ర ప్రభావం చూపింది. పచ్చని పంటపొలాలూ దెబ్బతిన్నాయి. దీంతో తమకు ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరోమార్గం లేదని జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను నేమకల్లు, ఉంతకల్లు ప్రాంత రైతులు ఆశ్రయించారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన ట్రిబ్యునల్‌ క్షేత్రస్థాయి పరిశీలన జరిపి ప్రజలకు ఇబ్బందులు కలిగించే క్వారీ, క్రషర్లను నిలిపేయాలని మైనింగ్‌ అధికారులకు నోటీసులు జారీ చేసింది. దీంతో ప్రమాదానికి కారణమైన 17 క్వారీలను అధికారులు మూతేశారు. ఈ నేపథ్యంలో వీటి టెండర్లపై ప్రజలు అభ్యంతరాలు లేవనెత్తే అవకాశమూ లేకపోలేదు.

విద్యుదాఘాతంతో బేల్దారి మృతి



మృతుడు రమేష్‌

శెట్టూరు: విద్యుత్‌ షాక్‌కు గురై ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం చిన్నంపల్లికి చెందిన వడ్డే రమేష్‌ (32) బేల్దారిగా జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం ఉదయం లక్ష్మంపల్లికి చెందిన ఉస్మాన్‌ సాహెబ్‌ ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొన్నాడు. ఇంటిపై భాగంలో పనిచేస్తున్న సమమయంలో చేతిలో ఉన్న కడ్డీ అటుగా వెళుతున్న విద్యుత్‌ తీగలను తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాంభూపాల్‌, ట్రాన్స్‌కో ఏఈ జయకృష్ణ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నెత్తురోడిన రహదారులు

- వేర్వేరు ప్రాంతాల్లో ఏడుగురి దుర్మరణం
- ప్రాణాలు బలిగొన్న అతి వేగం
- పలువురికి తీవ్ర గాయాలు

జిల్లాలోని రహదారులు రక్త దాహం తీర్చుకున్నాయి. ఆదివారం ఒక్కరోజే వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఇద్దరు సోమవారం ప్రమాదానికి గురైన వారున్నారు. ఆయా ఘటనల్లో పలువురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. వాహన చోదకుల అతివేగమే ప్రమాదాలకు కారణంగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.



అనంతపురం శివారున చోటు చేసుకున్న ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్‌, ఆటో



యాడికి వద్ద ప్రమాదంలో మృతి చెందిన తండ్రిని చూసి రోదిస్తున్న కుమారుడు



కూడేరు వద్ద ప్రమాదాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం: స్థానిక గుత్తిరోడ్డు సమీపంలోని కేటీఆర్‌ ఫంక్షన్‌ హాల్‌ వద్ద ఆదివారం రాత్రి ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు ద్విచక్ర వాహన చోదకుడూ మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం ట్రాఫిక్‌ సీఐ వెంకటేశ్‌నాయక్‌ తెలిపిన మేరకు... జిల్లా కేంద్రంలోని పాతూరు శ్రీకృష్ణదేవరాయనగర్‌కు చెందిన గౌస్‌ (38) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం తన కుమారుడు మహమ్మద్‌ అయాన్‌తో కలసి కేటీఆర్‌ ఫంక్షన్‌ హాల్‌ వద్ద బాడుగ వదిలి తిరుగు ప్రయాణమయ్యాడు. ఆకుతోటపల్లికి చెందిన వంశి (21) తన మిత్రుడు మదన్‌మోహన్‌రెడ్డితో కలసి ఇస్కాన్‌ ఆలయం వద్ద టపాసులు కొనుగోలు చేసి స్వగ్రామానికి వెళుతూ వేగాన్ని నియంత్రించుకోలేక కేటీఆర్‌ ఫంక్షన్‌ హాల్‌ వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నాడు. ఘటనలో వాహనాలు రెండూ నుజ్జునుజ్జయ్యాయి. గౌస్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మహమ్మద్‌ అయాన్‌, వంశి, మదన్‌మోహన్‌రెడ్డిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందలోపు వంశి మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉన్న మదన్‌మోహన్‌రెడ్డిని కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై అనంతపురం ట్రాఫిక్‌ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆటోను ఢీకొన్న కారు

యాడికి: ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తికి చెందిన రామచంద్రారెడ్డి (62)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూరగాయల వ్యాపారంతో జీవనం సాగించే వారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం గుత్తి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన హరికృష్ణ ఆటోలో కూరగాయలు తీసుకొని తాడిపత్రి ప్రాంతంలోని పలు గ్రామాల్లో విక్రయించి గుత్తికి తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం యాడికిలోని మోడల్‌ స్కూల్‌ సమీపంలోకి చేరుకోగానే 67వ జాతీయ రహదారిపై ఎదురుగా అతివేగంతో అడ్డదిడ్డంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌ పక్కనే కూర్చొన్న రామచంద్రారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన హరికృష్ణను పోలీసులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు చంద్రశేఖరరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనం ఢీకొని..

రాయదుర్గంటౌన్‌: ఆగి ఉన్న బైక్‌ను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం బైరసముద్రం నివాసి అభి (17) ఆదివారం సాయంత్రం రాయదుర్గంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. బీటీపీ రోడ్డులోని హౌసింగ్‌ లే అవుట్‌వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డుకు ఆనుకుని నిలబడిన మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఘటనలో అభి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంపై ఉన్న కర్ణాటకలోని తిమ్మనపల్లికి చెందిన మంజునాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు.



కంబన్న (ఫైల్‌)



మృతి చెందిన అభి

లారీని ఢీకొని..

తాడిపత్రి టౌన్‌: మండలంలోని గంగాదేవిపల్లి సమీపంలో రాయలచెరువు ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న గంగాదేవిపల్లి నివాసి కంబన్న (36) అక్కడికక్కడే మృతి చెందాడు. నందలపాడుకు చెందిన శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. వీరిద్దరూ గంగాదేవి పల్లికి వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించి, మెరుగైన వైద్యంకోసం అనంతపురంలోని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. మృతుడు కంబన్నకు భార్య నారాయణమ్మ, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై తాడిపత్రి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బస్సును ఢీకొన్న బైక్‌

కూడేరు: ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు యువకులు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగర శివారులోని రుద్రంపేటకు చెందిన హరినాథరెడ్డి (23), ప్రవీణ్‌తేజ (22) శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో హరినాథరెడ్డి కొనుగోలు చేసిన నూతన ద్విచక్ర వాహనానికి పూజ చేయించేందుకు సోమవారం ఉదయం ఉరవకొండ మండలం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఇద్దరూ చేరుకున్నారు. పూజల అనంతరం తిరుగు ప్రయాణమైన వారు కూడేరు మండలం ముద్దలాపురం సమీపంలో వేగాన్ని నియంత్రించుకోలేక ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న ప్రవీణ్‌ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. హరినాథరెడ్డి తలకూ బలమైన గాయమైంది. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం రాత్రి ఆయన కూడా మృతి చెందాడు. ఘటనపై కూడేరు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ఇటీవల పంపనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన, గాయపడిన కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా కల్పించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సూరయ్య (55), షఫి (33) మృతదేహాలకు నివాళులర్పించారు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్సలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ధనుంజయ యాదవ్, పంపనూరు సర్పంచు ఎర్రిస్వామి, మాజీ సర్పంచ్ వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగు



వీల్‌చైర్‌పై వృద్ధుడిని తీసుకెళ్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపర్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేశారు. నగరంలో ఉన్న పది వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఆరింటికి నూతన భవనాలు మంజూరు చేశారు. ఇప్పటికే నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఒక్కో ఆరోగ్య కేంద్రానికి రూ.10 లక్షల చొప్పున పునరుద్ధరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో 64 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులు ఉచితంగా ఇస్తున్నారు. వీటితో పాటు పది పడకలు, మంచాలు ఏర్పాటు చేశారు. నడవలేని స్థితిలో పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వృద్ధులు, రోగుల సౌకర్యార్థం వీల్‌చైర్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

పంపనూరు వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



పంపనూరు వద్ద ప్రమాదాలు జరిగే స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ నరేంద్రరెడ్డి, పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు వద్ద స్పీడ్ బ్రేకులు ఏర్పాటు చేశారు. పంపనూరు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల బొలెరో వాహనం బీభత్సం సృష్టించి ఇద్దరి మరణానికి కారణమైంది. మరో ఐదుగురు గాయపడ్డారు. దీంతో పంపనూరు గ్రామస్తులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి, స్పీడు బ్రేకులు ఏర్పాటు చేయించారు. ఆదివారం సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు పంపనూరు వద్ద రెండు చోట్ల స్పీడ్ బ్రేకులు ఏర్పాటు చేశారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విభజన హామీలు అమలు చేయకుండా అన్యాయం



ఎర్ర చొక్కాలు ధరించి కవాతు నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని సీపీఎం నాయకులు విమర్శించారు. ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని స్థానిక కృష్ణ కళామందిర్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ఎర్ర చొక్కాలతో కవాతు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నల్లప్ప, నాగేంద్రకుమార్ మాట్లాడారు. విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒకవైపు అన్యాయం చేస్తూ... మరోవైపున రాష్ట్ర సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందని విమర్శించారు. కేంద్రం చర్యలను ఎండగడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 'ప్రజారక్షణ భేరి'ని సీపీఎం నిర్వహించిందన్నారు. ఈనెల 15న విజయవాడలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు సీపీఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాంఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, వెంకటనారాయణ, ప్రకాశ్‌రెడ్డి, బాలకృష్ణ, నరసింహారెడ్డి, వరలక్ష్మి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నగరం.. దీపావళి సంబరం



నగరంలో బాణాసంచా వెలుగులు



ఇంటి ముంగిట దీపాలతో యువతులు



బాణాసంచా కాలుస్తున్న చిన్నారులు



కాశీవిశ్వేశ్వరాలయంలో కేదారేశ్వరీ నోములు

అనంతపురం కల్చరల్: నగరంలో ఇంటింటా దీపావళి కాంతులు విరజిమ్మాయి. నరక చతుర్దశి, దీపావళి అమావాస్య రెండురోజులుగా జరుపుకున్నారు. నగరవాసులు బాణాసంచా పేలుస్తూ ఆనందంగా జరుపుకున్నారు. నగరంలోని ఆర్ఎఫ్‌రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం, పాతూరులోని మహాలక్ష్మీ ఆలయంలో లక్ష్మీ పూజలు శాస్త్రోక్తంగా సాగాయి. స్థానిక మొదటిరోడ్డులోని శివాలయంలో కేదారేశ్వర నోములను మహిళలు నియమనిష్టలతో ఆచరించారు. స్థానిక అశోక్‌నగర్‌లోని హరిహర ఆయలంలో నరకచతుర్థి వేడుకలు వినూత్నంగా సాగాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఫణిరాజ్, సందీప్, శివ ప్రవీణ్, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా నిలువెత్తు నరకాసురుడి ప్రతిమను దీపావళి బాణాసంచా వెలుగుల్లో దహనం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చంద్రమోహనరెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని గ్రామ గ్రామానా దీపావళి పండుగను ప్రజలు సంబరంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాలు, ఇళ్లలో గౌరీమాతను కొలువు దీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం, సోమవారం అమావాస్య గడియాలు ముగియక మునుపే గౌరీ నోములు నోచి వ్రతమాచరించారు. మండలంలోని రాప్తాడులో నీలకంఠేశ్వరస్వామి, సాయిబాబా ఆలయం, ఆంజనేయస్వామి, పండమేటి వెంకటరమణస్వామి, హంపాపురంలో 39 అడుగుల అభయాంజనేయస్వామి, మరూరులో చిన్నకదిరయ్యస్వామి, అయ్యవారిపల్లిలో ఎర్రితాత స్వామి తదితర చోట్ల భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.



నరకాసుర వధ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, తదితరులు

ఇంటింటా దీపావళి

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఇంటింటా దీపావలి జరుపుకున్నారు. మండలంలో ఆదివారం, సోమవారం దీపావలి పండుగ జరిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం రూరల్: దీపావళి పండగను పురస్కరించుకొని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పుష్పా డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సినిమా పాటలకు చిన్నారులు వేసిన స్టెప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో పోలీసుల దీపావళి సంబరాలు

అనంతపురం క్రైం: జిల్లాలో ఉన్న అనాథ, వృద్ధుల, అంధుల ఆశ్రమాల్లో పోలీసులు దీపావళి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వినూత్న రీతిలో ఆలోచించి ఆశ్రమాల్లో దీపావళి వేడుకలు జరిపారు. వృద్ధులు, అనాథలు, అంధ పిల్లలకు మేమున్నామంటూ పోలీసులు భరోసా ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వృద్ధులు, అనాథలు, అంధుల ఆశ్రమాలకు పోలీసులు వెళ్లారు. ఆశ్రమాల్లో ఉంటున్న అందరినీ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కేక్ కట్ చేసి, దీపావళి సంబరాలు జరుపుకున్నారు. నూతన దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు.



డ్యాన్సుతో అలరిస్తున్న చిన్నారులు



అన్నదానం చేస్తున్న పోలీసులు



రాప్తాడులో ఓ ఇంట్లో గౌరీదేవికి పూజలు చేసిన దృశ్యం



రాప్తాడులో టపాసులు కాలుస్తున్న స్థానికులు

జగనన్న ప్రగతి పథం పోస్టర్ల ఆవిష్కరణ



జగనన్న ప్రగతి పథం ర్యాలీ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 18న విజయవాడలో జరగనున్న జగనన్న ప్రగతి పథం ర్యాలీ పోస్టర్లను ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆదివారం వారి నివాసాల్లో వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రగతి పథం ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. దేశంలోనే ఏ ప్రభుత్వం..ఎక్కడా లేని విధంగా మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను 98 శాతం పూర్తి చేసి, వందశాతం దిశగా అడుగులు వేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ నయవంచక పాలన, ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుపరిపాలనను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. ర్యాలీలో పెద్ద ఎత్తున యువత, పార్టీ శ్రేణులు పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ మంజునాథయాదవ్, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిచౌదరి, నాయకులు చంద్రమోహన్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఆధిపత్యపోరు



ఆలూరు సాంబశివారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కేరళవాసులు

అనంతపురం కల్చరల్: గత కొన్నేళ్లుగా సాగుతున్న పాతూరు చెరువుకట్ట అయ్యప్ప స్వామి ఆలయ ఆధిపత్య పోరు మరోసారి రచ్చకెక్కింది. అనంతలో దశాబ్దాల కిందట స్థిరపడిన కేరళవాసులు నందకుమార్, శ్రీకాంత్, జగదీష్, పద్మనాభన్ తదితరులతో కలిసి చెరువుకట్టపైనున్న అయ్యప్ప ఆలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డికి వినతి పత్రం అందించి, సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 308/77 రిజిష్టర్ నంబర్‌తో ఎస్పీ చంద్ర, వాసుదేవనాయర్, ఉన్నికృష్ణనాయర్, దేవేశన్‌నాయర్ తదితరులు శ్రీ అయ్యప్ప సేవా సమాజ్ ఏర్పాటు చేసుకొని అయ్యప్ప భక్తుల సాయంతో ఆలయం నిర్మించుకున్నామన్నారు. అయితే కొందరు స్వార్థపరులు ఆలయాన్ని ఆక్రమించుకున్నారన్నారు. ఫేక్ డాక్యుమెంట్లతో ప్రస్తుత కార్యవర్గం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయాన్ని ఆక్రమించుకున్నారు..

ప్రస్తుత ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతం విలేకరులతో మాట్లాడుతూ ఆలయం విషయం కోర్టులో ఉందని, దీనిపై రచ్చ చేయడం బాధాకరమన్నారు. ఇదివరకే అవసరమైన డాక్యుమెంట్లను కోర్టుకు సమర్పించామన్నారు. నందకుమార్ అనే వ్యక్తి ఆలయాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తమ తండ్రితో పాటు మరి కొంత మంది మాత్రమే అప్పటి నుంచి కొనసాగుతున్నారని స్పష్టం చేశారు.

వైఎస్ జగన్‌తోనే మైనార్టీల సంక్షేమం



మాట్లాడుతున్న ఆల్‌మేవా నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే ముస్లింమైనార్టీల సంక్షేమం సాధ్యమని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్‌మేవా) రాష్ట్ర సహాయ అధ్యక్షుడు ఫకృద్దీన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆల్‌మేవా కార్యాలయంలో ఉమ్మడి జిల్లా నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫకృద్దీన్ మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి గతంలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్ర స్థాయిలో ఘనంగా వేడుకలు నిర్వహించారన్నారు. ఉర్దూ అకాడమీ ద్వారా ఎంపికైన ముస్లిం మైనార్టీ ఉద్యోగులకు, విద్యార్థులు, కవులు, రచయితలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు, నగదు పురస్కారాలు అందజేయడం సంతోషకరమన్నారు. ముస్లిం, క్రిస్టియన్ల వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ఇమాం, మౌజన్లకు గౌరవేతనం మంజూరు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సమాన గౌరవంతో సంక్షేమ పథకాలకు మైనార్టీలకు మంజూరు చేస్తున్నారన్నారు. ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇతర నామినేటెడ్ పదవులు ఇచ్చి ప్రోత్సహించడంపై మేవా తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. డిసెంబర్ 25న జరగబోవు రాష్ట్ర స్థాయి అసోసియేషన్ ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడు షెక్షావలి, ప్రధాన కార్యదర్శి ఫరూక్ అహ్మద్, మక్బూల్, జిలాన్ అష్రాఫ్‌వలి, ఇక్బాల్, దౌలా, బాషా, రఫి, వలి, డేవిడ్, రసూల్, అన్వర్, మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అత్తారింట్లో ఉన్నా ప్రాణాలు దక్కేవి!

- పంపనూరు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నందమూరి నగర్‌కు చెందిన మహమ్మద్ షఫి



భార్య, కూతురు, కుమారుడితో మహమ్మద్ షఫి (ఫైల్)

రాప్తాడురూరల్: ఐదు నిముషాలపాటు అత్తారింట్లో గడిపి ఉన్నా ప్రాణాలు దక్కేవని ఈనెల 11న ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహమ్మద్ షఫి స్నేహితులు, బంధువులు విలపిస్తున్నారు. ఊహించని విధంగా క్షణాల్లో కళ్లెదుటే స్నేహితుడు అనంత లోకాలకు వెళ్లిపోవడాన్ని స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ నందమూరినగర్‌కు చెందిన ఎర్రిస్వామి, జులేఖ దంపతులకు ఏకైక కుమారుడు మహమ్మద్ షఫి. పెయింటర్ అయిన షఫీకి ఆరేళ్ల కిందట పంపనూరుకు చెందిన రేష్మాతో వివాహమైంది. వీరికి ఐదేళ్ల కుమారుడు, మూడేళ్ల కూతురు సంతానం. వివాహం అయినప్పటి నుంచి షఫీ కుటుంబం వేరుగా ఉంటోంది. రేష్మా స్నేహితురాలి వివాహం కోసమని ఈనెల 11న రాత్రి పంపనూరుకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. భార్య, పిల్లలను అత్తారింట్లో దింపి ద్విచక్రవాహనం అక్కడే ఉంచి స్నేహితులతో కలిసి అలా రోడ్డుపైకి వచ్చాడు.

కళ్లెదుటే ఊహించని ప్రమాదం..

షఫీ స్నేహితులతో కలిసి రోడ్డుపై నిలబడి మాట్లాడుతుండగా, మృత్యువు రూపంలో వచ్చిన బొలెరో వాహనం క్షణాల్లో షఫీ మీదకు దూసుకొచ్చింది. హఠత్పారిణామంతో స్నేహతులు తేరుకునేలోపే షఫీ అక్కడిక్కడే మృతి చెందాడు. అత్తారింట్లో ఐదు నిముషాలు గడిపి ఉన్నా, ఈ ప్రమాదం సంభవించేది కాదని బంధువులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. తన స్నేహితురాలి పెళ్లికి వచ్చి ఈ విషాద ఘటన చోటు చేసుకోవడాన్ని మృతుడి భార్య రేష్మా తలచుకొని కుమిలి కుమిలి ఏడుస్తోంది. కాగా వైఎస్సార్ బీమా కింద మృతుడి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు మంజూరవుతుంది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాధమ్మ, నాయకులు ధనుంజయయాదవ్ హామీ ఇచ్చారు.

నిరాశ్రయ కుటుంబానికి 'అమ్మ' ఆసరా



బాధితులకు దుస్తులు అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని విజయనగర్ కాలనీలో నివాసం ఉంటున్న నిరాశ్రయ కుటుంబానికి 'అమ్మ' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆసరా కల్పించారు. కాలనీలో నివాసం ఉంటున్న రాము ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అనారోగ్యంతో అతను ఇంటికే పరిమితమయ్యాడు. భార్య ఫకృబీ ఇంటి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. కూతురు అశ్విని వస్త్ర దుకాణంలో పనిచేస్తూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటోంది. కొడుకు అశోక్ ఇంటర్ చదువుతున్నాడు. అతికష్టమ్మీద కుటుంబాన్ని నెట్టుకొస్తున్న సమయంలో దీపావళి పండుగరోజున షార్ట్‌సర్క్యూట్‌తో రాము ఇల్లు మొత్తం కాలిపోయి, వీధిన పడాల్సివచ్చింది. అంతోఇంతో దాచుకున్న డబ్బు, సర్టిఫికెట్లు, ఇంటి సామగ్రి కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. ఆ కుటుంబానికి రూ.25 వేల నగదు, మరో రూ. 25 వేలు విలువజేసే నిత్యావసర వస్తువులు, గ్యాస్‌స్టవ్, మంచాలు, పరుపులు, స్టీలు సామగ్రి అందించాడు.

సంక్షిప్త సమాచారం

'సమగ్ర' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బాలకాశి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని కొత్తూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కాంట్రాక్ట్, జేఏసీ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ కె. విజయ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు బాలకాశి మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలన్నారు. సమావేశంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు దివాకర్, ఈశ్వర్, దాదు, మనోహర్, మస్తాన్, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, ప్రభావతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 32వ సచివాలయ పరిధిలోని బోయ వీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం జరగనున్నట్లు అదనపు కమిషనర్ రమణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ కాలనీలోని ఛత్రపతి స్కూల్, గుత్తి రోడ్డులోని మాంటిస్సోరీ స్కూల్‌లో జరగాల్సిన శిబిరం ఈ నెల 15కు వాయిదా పడినట్లు అదనపు కమిషనర్ తెలిపారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

రాప్తాడు: మండలంలోని పాలచెర్లలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధు లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంఘ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జి. సూర్యుడు, ప్రధాన కార్యదర్శి యస్. రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె. చంద్రశేఖర్ రాష్ట్ర, కౌన్సిలర్ పణిభూషణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కిశోర్, కుల్లాయప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

దాడి చేసి బంగారం దోచుకెళ్లారని ఫిర్యాదు

అనంతపురం క్రైం: స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు జయప్ప భార్య పద్మశ్రీపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి, బంగారం దోచుకెళ్లారని బాధితురాలు సోమవారం ఫిర్యాదు చేసింది. వివరాలను టూటౌన్ సీఐ శివరాముడు విలేకరులకు తెలిపారు. జయప్ప ఇంటికి అతి సమీపంలో చర్చి నిర్మాణం జరుగుతోంది. జయప్ప భార్య అటువైపు వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి దాడి చేశారని, ఆమె స్పృహ తప్పిపడిపోయింది..తీరా చూస్తే కుమార్తెలు వచ్చి తనను పైకిలేపారని చెప్పింది. తన ఒంటిపై ఉన్న బంగారం, చేతిలో గాజులు తీసుకెళ్లారని చెప్పింది. ఈమె ఫిర్యాదులో స్పష్టత లేదని, అనుమానాలున్నాయని సీఐ తెలిపారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం క్రైం: స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎల్ఐజీ బస్టాప్ వద్ద నివాసం ఉంటున్న షేక్‌హుస్సేన్ (35) ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ శివరాముడు తెలిపిన వివరాల మేరకు.. షేక్‌హుసేన్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. భార్య సంపాదన పైనే కుటుంబం గడుస్తోంది. తాగుడుకు బానిస అయిన హుసేన్ ..కుటుంబ పరిస్థితిని పట్టించుకోలేదు. ఆర్థిక సమస్యలు కూడా ఉన్నాయి. వాటిని తీర్చే మార్గం లేక.. షేక్ హుసేన్ ఆత్మహత్యాయత్నం చేశాడు. సకాలంలో కుమార్తె గమనించి, స్థానికుల సహకారంతో అతన్ని ఆస్పత్రికి చేర్చారు. చికిత్స చేసేలోపు పరిస్థితి విషమించి, మృతిచెందాడు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. సోమవారం నగరంలోని 3వ సర్కిల్ పరిధిలోని కమలానగర్, పాతూరు, కలెక్టరేట్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. రోడ్డుపై చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

18న షిర్డీ సాయి విగ్రహ ప్రతిష్ట

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం బళ్లారిరోడ్డు – ఓంనగర్‌లో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈనెల 18న విగ్రహ ప్రతిష్ట జరగనుంది. ఆలయ తూర్పుభాగంలో 10 సెంట్ల స్థలంలో నూతన ఆలయాన్ని నిర్మించి, పాలరాతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భక్తుల ఔదార్యం, ఆలయ కమిటీ సభ్యుల నిరంతర పర్యవేక్షణతో ఆలయ నిర్మాణ పనులు వేగవంతంగా జరిగాయని ఆలయ కమిటీ చైర్మన్ వలిపి నారాయణరెడ్డి తెలిపారు.

మూడు రోజుల పాటు ప్రతిష్ట ..

విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఈనెల 16 నుంచి 18 వరకు మూడురోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. తొలిరోజు 16న ఉదయం 7.30 గంటలకు గోపూజ, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, విశేష పూజలు, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం ప్రదోషకాల పూజ, జపాలు, హోమాలు, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుంది. 17న ఉదయం 7.30 గంటలకు ప్రాతఃకాలపూజ, మహాస్నపనం, 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం ప్రదోషకాల పూజ, జపాలు, శయ్య, పుష్ప, ధాన్యాధి వాసాలు, దీక్షాహోమం, మంగళహారతి ఉంటుంది. చివరి రోజు 18న ఉదయం 8.30 గంటలకు దేవతా యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, కలశప్రతిష్ట జరుగుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి హారతి, 12.30 గంటల నుంచి మహా అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

ముగిసిన మహా సంప్రోక్షణ

అనంతపురం కల్చరల్: నగరంలోని శివకోటి శ్రీపీఠంలో జరిగిన మహా కుంభాభిషేక మహా సంప్రోక్షణ వేడుకలు మహా పూర్ణాహుతితో ముగిశాయి. శివకోటి వ్యవస్థాపకుడు శివయ్యస్వామీజీ నేతృత్వంలో జరిగిన నవకన్యాపూజ, దంపతిపూజ, కలశోద్వాసన, మహాఆశీర్వాదం, మంగళనీరాజన కార్యక్రమం నేత్రానందంగా సాగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 90 మంది వేదపండితుల సామూహిక వేదపారాయణం, వేద మంత్రోచ్చారణ, వివిధ రకాల హోమాలు, అన్న సంతర్పణతో స్వస్తి పలికారు.

కార్తికేయుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో కాల సర్పదోష నివారణ హోమాలు, రాహుకేతు హోమాలు నిర్వహించారు. మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేకంగా పూజలు చేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం జర్మనీదేశంలో దీపావళి పర్వదినం సందర్భంగా చేసిన కూచిపూడి నృత్యం అక్కడివారిని ఆకట్టుకుంది. జర్మనీలోని డీఐజీ మెయిన్‌జడ్ ప్రాంతంలో ఇండో జర్మన్ అసోసియేషన్ చైర్మన్ నాగశ్రీ ఆధ్వర్యంలో దివాళీఫెస్ట్ జరిగింది. సంధ్యామూర్తి శిష్యులు మహాలక్ష్మి, హిమజ, శ్రీధరి, దివ్యశ్రీలతో కలిసి సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు.

ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

రాప్తాడు: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి, ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఎస్‌వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ అన్నారు. సోమవారం రాత్రి హంపాపురం సమీపంలోని వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ మాట్లాడుతూ ఎంతటి విజయమైనా తొలి అడుగుతోనే ప్రారంభమవుతుందన్నారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణా రెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి, కళాశాల యండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి, కళాశాల సీఈఓ ఆనంద్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ సుధాకర్ బాబు, కో కన్వీనర్ పావని పాల్గొన్నారు.